SK1 one NEWS HD

సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

సీమకిరణం

RNI APTEL / 2018/76380

SEEMAKIRANAM TELUGU DAILY

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

జాతీయ తెలుగు దినపత్రిక

Printed and Published From: Kurnool/Nandyala | సంపుటి 08 | సంచిక 203 | సోమవారం 2-11-2026 | పేజీలు 4 | వేల రూ: 2/

ఢిల్లీలో హీటెక్కిన రాజకీయం..

- ఢిల్లీ వీధుల్లో బీజేపీ, కాంగ్రెస్ బలప్రదర్శన
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్
- రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండి కూటమి ఛలో ఢిల్లీ ర్యాలీ
- ఓటు చోరీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసన
- రామ్‌లీలా మైదానం వరకు కాంగ్రెస్ కూటమి మార్చ్


2లో

తెలుగు రాష్ట్రాల్లో అత్యంత భారీ వర్షాలు


2లో

బంగాళాఖాతంలో మురాసు తుపానుగా మారిన తీవ్ర అల్పపీడనం

. ఆదివారం ఉదయం 11.30 గంటలకు తుపాను కేంద్రీకృతం

. పశ్చిమ వాయవ్య దిశగా కదులుతున్న మురాసు తుపాను

నవంబర్ 2 ఉదయానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం

నవంబర్ 2 అర్ధరాత్రి నుంచి 3 తెల్లవారుజామున తీరం దాటే ఛాన్స్

ఏపీ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతం..

20 జిల్లాల్లో 41 ఘటనలు: డీజీపీ

- ఏపీలో ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్
- రాష్ట్రవ్యాప్తంగా 13 కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీల్లో పోలింగ్
- 20 జిల్లాల్లో 41 ఘటనలు.. వివరాలు సేకరిస్తున్న అధికారులు
- ఎన్నికల వేళ భారీగా పోలీసు బలగాల మోహరింపు
- సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు
- డోన్లు, బాడీ వార్న్ కెమెరాలతో పోలింగ్ సరళిపై నిఘా
- ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నిరంతర పర్యవేక్షణ
- ఎన్నికల ఘటనలపై చట్టపరమైన చర్యలకు ఆదేశాలు
- కడప, కర్నూలు, అనంతపురం సహా 20 జిల్లాల్లో ఘటనలు
- . నిందితులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం: డీజీపీ



అమరావతి:సీమ కిరణం

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. ఏపీ వ్యాప్తంగా 13 కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని వెల్లడించారు. అయితే, 20 జిల్లాల్లో 41 ఘటనలు చోటుచేసుకున్నాయని, వాటికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నామని చెప్పారు. ఆయా ఘటనలపై చట్టపరమైన చర్యలకు ఆదేశాలు జారీ చేశామని డీజీపీ పేర్కొన్నారు.ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పోలింగ్ సరళి, భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించినట్లు డీజీపీ తెలిపారు. ఎన్నికల

- మిగతా 2లో పేజీలో



రాప్తాడు పాఠశాల విద్యార్థినిపై దాడి కేసు..

నిందితుడు హేమంత్‌పై పోలీసుల కాల్పులు.

- పోలీసుల కాల్పుల్లో హేమంత్‌కు తీవ్ర గాయాలు
- చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు
- బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో బాలికకు చికిత్స
- బాధిత బాలికను పరామర్శించిన మంత్రి నారా లోకేశ్
- బాలికకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచన
- బాధిత కుటుంబానికి ప్రభుత్వం

ముగిసిన ఏపీ మున్సిపల్ ఎన్నికల పోలింగ్..

- ఏపీలో 92 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ పూర్తి
- 11 కార్పొరేషన్లు, 73 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీల్లో ఎన్నికలు
- సాయంత్రం 5 గంటల్లోపు క్యూలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం
- విజయవాడ 55వ డివిజన్‌లో రాత్రి 7.30 గంటల వరకు పోలింగ్
- బ్యాలెట్ పేపర్‌పై గుర్తులు తారుమారు.. ఆలస్యంగా ప్రారంభమైన ఓటింగ్
- విజయవాడ 55వ డివిజన్‌కు అదనపు సమయం కేటాయింపు
- పోలింగ్ ముగిసిన ప్రాంతాల్లో బ్యాలెట్ బాక్సుల తరలింపునకు ఏర్పాట్లు
- శాంతిభద్రతలకు ప్రాధాన్యమిస్తూ ఎన్నికల నిర్వహణ

అమరావతి:సీమ కిరణం

ఆంధ్రప్రదేశ్‌లో 92 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ముగిసిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా ప్రకటించారు. 11 కార్పొరేషన్లు, 73 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీల్లో పోలింగ్ ముగిసినట్లు ఆయన తెలిపారు. అయితే, సాయంత్రం 5 గంటల్లోపు బూత్‌లో ఓటు వేసేందుకు క్యూలో ఉన్నవారికి అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, విజయవాడ 55వ డివిజన్‌లో ఓటింగ్ సమయాన్ని పొడిగించినట్లు తెలిపారు. రాత్రి 7.30 గంటల వరకు పోలింగ్‌కు అవకాశం ఇచ్చామని పునేఠా పేర్కొన్నారు.విజయవాడ 55వ డివిజన్‌లో బ్యాలెట్ పేపర్‌పై గుర్తులు తారుమారు కావడంతో ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభమైందని, అందుకే అదనపు సమయాన్ని కేటాయించినట్లు ఎన్నికల కమిషనర్ పునేఠా చెప్పారు. మిగతా ప్రాంతాల్లో పోలింగ్ ముగిసినందున బ్యాలెట్ బాక్సుల తరలింపునకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

శాంతిభద్రతల అంశాన్నే ప్రధానంగా భావించి ఎన్నికలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించామని చెప్పుకొచ్చారు. కాగా, ఈ రోజు నిర్వహించిన ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాలు ఈనెల 3న (మంగళవారం) వెలువడతాయని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా తెలిపారు.



తెలంగాణకు ప్రధాని మోదీ ఏం ఇచ్చారు?

- బడే బాయ్.. చోటే బాయ్ ఒక్కటయ్యారు.. కాంగ్రెస్, బీజేపీపై కేటీఆర్ ఫైర్
- 2ల. 13 ఏళ్ల మోదీ పాలనలో తెలంగాణకు ఏం చేశారు? ఒక్క జాతీయ ప్రాజెక్టు అయినా ఇచ్చారా?
- 3ల. ఆదిలాబాద్ ప్రజలకు కాంగ్రెస్, బీజేపీ నేతలు అన్యాయం చేస్తున్నారు
- 4ల. లచ్చులో లచ్చన్న.. ఈ లుచ్చగాళ్ల రాజ్యంలో బిచ్చగాళ్ల బతుకులు
- 5ల. రూ.15 లక్షల హామీ ఏమైంది? రూ.15 వేలూ ఇవ్వలేదు
- 6ల. ఆదిలాబాద్‌లో సీసీఐ ఫ్యాక్టరీని ఎందుకు పునఃప్రారంభించడం లేదు?
- రెండు వేల మందికి ఉద్యోగాలిస్తామన్న అమిత్ షా హామీ ఏమైంది?
- యూరియా యాప్.. కిసాన్ కపాస్ యాప్ అంటూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు
- 9 రాష్ట్రంలో సోయా కొనుగోళ్లు లేవు.. కేంద్రంలో పత్తి కొనుగోళ్లలో అన్యాయం
- 10ల. బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీ ఉన్నా ఆదిలాబాద్‌కు ఒరిగిందేమిటి?
- 11ల. కేసీఆర్ పాలనలో బంగారు తెలంగాణ.. ఇప్పుడు రైతుల ఆత్మహత్యల దుస్థితి
- 12ల. కాంగ్రెస్, బీజేపీ నేతలు తోడు దొంగల్లా వ్యవహరిస్తున్నారు: కేటీఆర్
- 13ల. ఆదిలాబాద్ రైతుల సమస్యలపై ప్రభుత్వాలను నిలదీసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- 14ల. సీసీఐ ఫ్యాక్టరీని తుక్కు కింద అమ్ముతున్నా పట్టించుకోరా?
- 15ల. మంచి పాలిచ్చే బర్రెను పక్కన పెట్టి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారు
- ముఖ్యమైన హైలైట్ సబ్ టైటిల్



హైదరాబాద్, సీమ కిరణం

కాంగ్రెస్, బీజేపీ నేతలు ఒక్కటై ఆదిలాబాద్ ప్రజలకు అన్యాయం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతుంటే.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మౌనంగా ఉంటోందని ఆరోపించారు. ఆదిలాబాద్ రైతు గర్జన సభలో మాట్లాడిన కేటీఆర్.. 'బడే బాయ్.. చోటే బాయ్ ఇద్దరూ ఒక్కటయ్యారు. దొంగ చీకటి ఒకటైపోయింది. ఇద్దరూ మంచి అండర్‌స్టాండింగ్‌తో వ్యాపారాలు చేసుకుంటున్నారు' అంటూ కాంగ్రెస్, బీజేపీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదిలాబాద్‌లో బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీ ఉన్నప్పటికీ ఒక్కరోజైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గట్టిగా నిలదీశారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ ప్రజాప్రతినిధులు ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. 'బడే బాయ్.. చోటే బాయ్ దోనో ఏక్ హోగే. బడే మియా తో


మిగతా 2లో

బంగాళాఖాతంలో 'మురసు' తుఫాన్

- బంగాళాఖాతంలో క్రమంగా బలపడుతున్న మురసు తుఫాన్
- . ఆరు గంటల్లో గంటకు 27 కిలోమీటర్ల వేగంతో తుఫాన్ ప్రయాణం
- చెన్నైకి 480 కి.మీ., నెల్లూరుకు 550 కి.మీ. దూరంలో తుఫాన్
- సోమవారం ఉదయానికి తీవ్ర తుఫాన్‌గా మారే అవకాశం
- నెల్లూరు-నరసాపురం మధ్య తీరం దాటే అవకాశం
- దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు
- కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు అతి భారీ వర్ష సూచన
- నెల్లూరు, మార్కాపురం జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం
- ఉభయ గోదావరి జిల్లాలు సహా పలు జిల్లాలకు వర్ష హెచ్చరికలు
- తిరుపతి, చిత్తూరు, పల్నాడు జిల్లాల్లోనూ అతి భారీ వర్ష సూచన
- నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల్లో భారీ వర్షాలు
- సముద్రంలో వేటకు వెళ్లొద్దు.. మత్స్యకారులకు అధికారుల హెచ్చరిక
- సహాయక చర్యల కోసం సిద్ధంగా ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

అమరావతి, **సీమ కిరణం** బంగాళాఖాతంలో ఏర్పడిన 'మురసు' తుఫాన్ క్రమంగా బలపడుతోంది. గడిచిన ఆరు గంటల్లో గంటకు 27 కిలోమీటర్ల వేగంతో కదులుతున్న ఈ తుఫాన్.. ప్రస్తుతం చెన్నైకి 480 కిలోమీటర్లు, నెల్లూరుకు 550 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 560 కిలోమీటర్లు, ఒంగోలుకు 600 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 610 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

తుఫాన్ సోమవారం ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుఫాన్‌గా బలపడే అవకాశం ఉందని తెలిపింది.



సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము మధ్య నెల్లూరు-నరసాపురం మధ్య తీరాన్ని దాటే అవకాశముందని అంచనా వేసింది. తుఫాన్ ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

- మిగతా 2లో పేజీలో

SK1 NEWS HD
సమస్యలపై పోరాటం కోసం మా అక్షర పోరాటం
RNI APTEL / 2018/76380
సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్: యస్. సకార్ అహ్మద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక
సోమవారం 2 -11- 2026

ఏపీ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతం..

20 జిల్లాల్లో 41 ఘటనలు: డీజీపీ

వేళ భారీగా పోలీసు బలగాలను మోహరించామని, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించామని చెప్పారు. వీడియోగ్రఫీ, డ్రోన్లు, బాడీ వార్న్ కెమెరాలు, సమర్థ యాప్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించామని పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించి కడప, కర్నూలు, అనంతపురం సహా మొత్తం 20 జిల్లాల్లో 41 ఘటనలు చోటుచేసుకున్నాయని చెప్పారు. ఈ ఘటనలన్నింటిపైనా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు.ప్రతి ఘటనలోనూ వాస్తవ పరిస్థితులను నిర్ధారించి, నిందితులను గుర్తిస్తామని హరీశ్ కుమార్ గుప్తా తేల్చి చెప్పారు. వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికలు ముగిసినందున పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను అత్యంత పటిష్టమైన భద్రత మధ్య సురక్షితంగా స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించేలా ఏర్పాట్లు చేశామన్నారు. కౌంటింగ్ ప్రారంభమయ్యే వరకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు కొనసాగుతుందని చెప్పారు. మరోవైపు, ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకోవడంపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా హర్షం వ్యక్తం చేశారు.

బంగాళాఖాతంలో 'మురసు' తుఫాన్.. ప్రస్తుత పరిస్థితి ఇది..

పలు జిల్లాల్లో భారీ వర్షాలు..

సోమవారం నాడు కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఒకటి రెండు ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, పల్నాడు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అల్లూరి, పోలవరం, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురవవచ్చని పేర్కొంది. నంద్యాల, వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లోనూ కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది.

వేటకు వెళ్లొద్దు.. మత్స్యకారులకు హెచ్చరిక..

తుఫాన్ నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరించారు. సహాయక చర్యల కోసం ముందస్తుగా ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ పరిస్థితులను గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు.

తెలుగు రాష్ట్రాల్లో అత్యంత భారీ వర్షాలు



బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం మరింత బలపడి మురాసు తుపానుగా మారింది. ఆదివారం ఉదయం 11.30 గంటలకు నైరుతి, దానికి ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపాను కేంద్రీకృతమైనట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ నవంబర్ 2వ తేదీ ఉదయానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని తెలిపింది. అనంతరం ఉత్తర వాయవ్య దిశగా పయనిస్తూ నవంబర్ 2 అర్ధరాత్రి నుంచి నవంబర్ 3 తెల్లవారుజామున మధ్య నెల్లూరు–నర్సాపురం మధ్య దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశం ఉందని అంచనా వేసింది.

గంటకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు

ఆదివారం ఉదయం 11.30 గంటలకు మురాసు తుపాను గంటకు 23 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతున్నట్లు ఐఎండీ తెలిపింది. ప్రస్తుతం ఇది చెన్నైకి తూర్పు ఆగ్నేయంగా 560 కిలోమీటర్లు, విశాఖపట్నానికి దక్షిణ ఆగ్నేయంగా 660 కిలోమీటర్లు, నెల్లూరుకు తూర్పు ఆగ్నేయంగా 630 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, గాలుల వేగం అప్పుడప్పుడు 120 కిలోమీటర్లకు చేరవచ్చని హెచ్చరించింది.

తుపాను ప్రభావంతో నవంబర్ 2, 3 తేదీల్లో కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ముఖ్యంగా నవంబర్ 3న తెలంగాణలో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. నవంబర్ 4న కూడా తెలంగాణలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని వెల్లడించింది. నవంబర్ 1, 2 తేదీల్లో తమిళనాడులో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాంధ్ర, యానాంలో నవంబర్ 2, 3 తేదీల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొంది. ఛత్తీస్‌గఢ్, దక్షిణ ఒడిశాలో నవంబర్ 3, 4 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

గాలులు, ఉరుములు, మెరుపులతో జాగ్రత్త

నవంబర్ 3న తెలంగాణలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, గరిష్ఠంగా 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని ఐఎండీ అంచనా వేసింది. నవంబర్ 2న కూడా తెలంగాణలో ఈదురుగాలులతో కూడిన ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉందని తెలిపింది. తుపాను కదలికలు, వర్షాల తీవ్రతపై ప్రజలు వాతావరణ శాఖ తాజా హెచ్చరికలను గమనించాలని సూచించింది.

ఒడిశాలో హై అలర్ట్.. ఎన్డీఆర్ఎఫ్ బలగాలు సిద్ధం

మురాసు తుపాను ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపిస్తున్న నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యంగా దక్షిణ ఒడిశా జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించింది. లోతట్టు ప్రాంతాలు, కొండ ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితులు ఉన్న ప్రాంతాల ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించింది.

తెలంగాణకు ప్రధాని మోదీ ఏం ఇచ్చారు? బీజేపీకి ఎందుకు ఓటేయాలి?

బడే మియా.. చోటే మియా సుభానల్లా అన్నట్టుగా ఇద్దరూ ఒక్కటైపోయారు. దొందూ దొందే.. ఇద్దరిలో ఎవరినీ నమ్మొద్దు' అని వ్యాఖ్యానించారు.

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆయన కుటుంబ సభ్యులు తాంసి, బేలా మండలాల్లో ఇండస్ట్రియల్ జోన్ పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఆ దోపిడీకి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సహకరిస్తోందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి దోపిడీ చేస్తుంటే బీజేపీ పెద్దలు కళ్లు మూసుకుని కూర్చుంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు తోడు దొంగలుగా వ్యవహరిస్తున్నారని అన్నారు.'లచ్చులో లచ్చన్న.. ఈ లుచ్చగాళ్ల రాజ్యంలో బిచ్చగాళ్ల బతుకులు'

ఆదిలాబాద్ జిల్లా ముద్దుబిడ్డ, మహాకవి గూడ అంజన్న రాసిన పాటను కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. 'లచ్చులో లచ్చన్న.. ఈ లుచ్చగాళ్ల రాజ్యంలో బిచ్చగాళ్ల బతుకాయే లచ్చులో లచ్చన్న' అంటూ అంజన్న రాసిన పాటలోని పంక్తులను ఉటంకించారు. కేసీఆర్ పాలనలో బంగారంలా మెరిసిన తెలంగాణ.. ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ మోసాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితికి చేరిందని విమర్శించారు. రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. 'ఈ మోసగాళ్ల ఉచ్చులో పడి ఆదిలాబాద్ గోస పడుతోంది' అని వ్యాఖ్యానించారు.

'15 లక్షలు రాలే.. 15 వేలూ రాలే'

ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. ఆ హామీ ఎవరికైనా నెరవేరిందా? అని ప్రశ్నించారు. 'చోటే బాయ్ చెప్పిన రూ.15 వేలు కూడా ఎవరికీ రాలేదు. ఇద్దరూ జూటా మనుషులే' అని విమర్శించారు. బీజేపీ నేతలు చెప్పే డబుల్ ఇంజన్ పాలనపై కూడా కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'ఏమన్నా మాట్లాడితే డబుల్ ఇంజన్ అంటారు. ఏం డబుల్ ఇంజన్? అయితే జుమ్లా.. లేకపోతే హమ్లా. అంతే తప్ప డబుల్ ఇంజన్ లేదు.. మన్ను లేదు' అని ఎద్దేవా చేశారు.ఆదిలాబాద్‌లో బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీ ఉన్నప్పటికీ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఫ్యాక్టరీని ఎందుకు తెరవడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. సీసీఐని తుక్కు కింద అమ్ముతున్నా బీజేపీ ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. సీసీఐ కోసం పోరాడుతున్నది మాజీ మంత్రి జోగు రామన్న ఒక్కరేనని అన్నారు. గతంలో ఆదిలాబాద్‌కు వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. సీసీఐని తిరిగి ప్రారంభించి, రెండు వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. 'ఆప్ హమారే కో ఓట్ దో.. హమ్ ఆప్కో సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జో దో హజార్ లోగో కో నౌకరీ దేగీ.. హమ్ ఉస్కో ఫిర్ సే చాలు కరేంగే' అని చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు మాత్రం సీసీఐని తుక్కు కింద అమ్ముతున్నారని విమర్శించారు. 'మా జోగు రామన్నకు ఉన్న ఫికర్ మీకెందుకు లేదు ఎమ్మెల్యే గారూ?' అని పాయల్ శంకర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. సీసీఐకి సావు డప్పు కొడుతున్నా బీజేపీ, కాంగ్రెస్ నేతలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. చోటే బాయ్ అయిన రాష్ట్ర ప్రభుత్వం సోయా కొనడం లేదని.. బడే బాయ్ అయిన కేంద్ర ప్రభుత్వం కూడా పత్తి కొనుగోళ్లలో రైతులకు అన్యాయం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా కోసం యాప్ పెట్టిందని, కేంద్ర ప్రభుత్వం పత్తి కొనుగోళ్లకు 'కిసాన్ కపాస్' యాప్ తీసుకొచ్చిందని విమర్శించారు. రెండు ప్రభుత్వాల విధానాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

చోటే బాయ్ ఏమో యూరియా యాప్ పెట్టిండు.. బడే బాయ్ ఏమో కిసాన్ కపాస్ యాప్ అని పెట్టిండు. ఇద్దరూ ఒకటే' అని వ్యాఖ్యానించారు. గత మూడేళ్లలో బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే వల్ల ఆదిలాబాద్ రైతులకు ఏమైనా ప్రయోజనం జరిగిందా? అని ఆలోచించాలని రైతులను కోరారు. 'మంచిగా పాలిచ్చే బర్రెను పక్కకు పెట్టి తన్నే దున్నపోతును తెచ్చుకున్నరు. అది తన్నకేం చేస్తది మరి? అది తంతది' అంటూ ప్రజల నిర్ణయంపై వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

రాప్తాడు పాఠశాల విద్యార్థినిపై దాడి కేసు..

అనంతపురం, అనంతపురం జిల్లా రాప్తాడు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినిపై దాడి చేసిన నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. బాలికపై దాడి అనంతరం తప్పించుకుని తిరుగుతున్న యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ క్రమంలో అతడిపై కాల్పులు జరిపినట్లు సమాచారం.

రాప్తాడు పాఠశాల విద్యార్థినిపై దాడి కేసు.. నిందితుడు హేమంత్‌పై పోలీసుల కాల్పులు..అనంతపురం జిల్లా: రాప్తాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థినిపై దాడి చేసిన నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై చెట్లు నరికే రంపం యంత్రంతో హేమంత్ దాడి చేశాడు. బాలిక తీవ్రంగా గాయపడటంతో అక్కడి నుంచి పరారయ్యాడు. అప్పటి నుంచి ఆ యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.అయితే, ఆత్మకూరు అడవుల్లో నిందితుడు ఉన్నాడనే పక్కా సమాచారంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వారికి అతను తారసపడగా.. తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో హేమంత్‌పై పోలీసులు కాల్పులు జరిపినట్లు సమాచారం. పోలీసుల కాల్పుల్లో యువకుడికి గాయాలైనట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన అతడిని పోలీసులు హుటాహుటిన అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.కాగా, నిందితుడి దాడిలో గాయపడిన బాలికను బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మంత్రి నారా లోకేశ్ నేడు ఆస్పత్రికి వద్దకు చేరుకుని బాలిక, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మరోవైపు, విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను మంత్రి లోకేశ్ కోరారు.

పీటీ స్వామి సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలవాలి..

గోదావరిఖనిలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తాం: హరీశ్‌రావు

ఝతీఅంష్ఠ ఝశీ । తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ప్రముఖ విద్యావేత్త పీటీ స్వామి సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. ఆయన జ్ఞాపకార్థం గోదావరిఖనిలో నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇందుకు ఎంత ఖర్చయినా పార్టీ భరిస్తుందని వెల్లడించారు.

పీటీ స్వామి దశదిన కర్మ సందర్భంగా ఆదివారం గోదావరిఖని మార్కండేయ కాలనీలోని ఆర్‌కే గార్డెన్స్‌లో నిర్వహించిన సంస్మరణ సభకు హరీశ్‌రావు హాజరయ్యారు. పీటీ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పీటీ స్వామిని కోల్పోవడం ఆయన కుటుంబానికే కాకుండా బీఆర్ఎస్ పార్టీకి, సింగరేణి కార్మిక లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన మరణవార్త విన్న వెంటనే పార్టీ అధినేత కేసీఆర్ ఎంతో బాధపడ్డారని చెప్పారు. సంస్మరణ సభకు పార్టీ ప్రతినిధులుగా తప్పకుండా హాజరుకావాలని కేసీఆర్ ఆదేశించడంతో ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.

కేసీఆర్‌కు పీటీ స్వామి అంటే ఎంతో అభిమానం, గౌరవం ఉండేవని హరీశ్‌రావు గుర్తుచేశారు. సింగరేణిలో బొగ్గు గని కార్మిక సంఘం ఏర్పాటు చేయాలనే ఆలోచన తొలుత కేసీఆర్‌కు అంతగా నచ్చలేదన్నారు. అప్పటికే ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాల్లో ఉన్న కార్మికులంతా తెలంగాణ బిడ్డలేనని, ప్రత్యేకంగా మరో సంఘం ఏర్పాటు చేస్తే తెలంగాణ ఉద్యమానికి వారు దూరమయ్యే ప్రమాదం ఉందని కేసీఆర్ భావించారని వివరించారు. అయితే పీటీ స్వామి, కొప్పుల ఈశ్వర్ తదితరులు కేసీఆర్‌ను ఒప్పించి టీబీజీకేఎస్ ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. ప్రత్యేక కార్మిక సంఘం ఏర్పాటుతో ఉద్యమం, పార్టీ బలోపేతం కావడంతో పాటు కార్మికులకు మేలు జరుగుతుందని వివరించారని చెప్పారు.

ఈ క్రమంలోనే టీబీజీకేఎస్ ఆవిర్భావానికి పీటీ స్వామి మూలకారకుడిగా నిలిచారని, సంఘం తొలి గౌరవ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారని వెల్లడించారు. 2001లో టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటైన నెల రోజుల్లోపే కొప్పుల ఈశ్వర్, మురళీధర్‌తో పాటు పీటీ స్వామి పార్టీలో చేరారని హరీశ్‌రావు తెలిపారు. అప్పటి నుంచి మరణించే వరకు 26 ఏళ్ల పాటు కేసీఆర్ వెన్నంటి ఉన్నారని చెప్పారు. ఆయనతో కలిసి తాను 14 ఏళ్లు తెలంగాణ ఉద్యమంలో, పదేళ్లు ప్రభుత్వంలో, అనంతరం ప్రతిపక్షంలో పనిచేశానని గుర్తుచేసుకున్నారు.

ఢిల్లీలో హీటెక్కిన రాజకీయం..

బీజేపీ కాంగ్రెస్ పోటాపోటీ నిరసనలు

ఇంటర్నెట్ డెస్క్: ఢిల్లీలో రాజకీయ వాతావరణం హీటెక్కింది. బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీ నిరసనలకు తెరతీసి నగర వీధులు దద్దరిల్లేలా చేశాయి. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సారథ్యంలోని ఇండి కూటమి పార్టీలు ఓట్ చోరీ మార్చ్ నిర్వహించాయి. మరోవైపు, కాంగ్రెస్‌ను టార్గెట్ చేసేందుకు బీజేపీ 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితుల సంస్మరణార్థంగా మరో ర్యాలీకి నిర్వహించింది.కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సారథ్యంలో ఇండి కూటమి పార్టీలు ఛలో ఢిల్లీ ర్యాలీలో పాల్గొన్నాయి. రామ్‌లీలా మైదానం వరకూ నిర్వహించాయి. నారీ నగర్ బస్‌స్టాప్ నుంచి తిలక్ నగర్ వరకూ బీజేపీ ర్యాలీ నిర్వహించింది. 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితుల కోసం ఉద్దేశించిన రోజున కాంగ్రెస్ తన పొలిటల్ ప్రోగ్రామ్ ప్రారంభించిందని బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది.ప్రతిపక్షాల మార్చ్ మధ్యాహ్నం మింటో రోడ్–కాన్నాట్ ప్లేస్ ప్రాంతంలో ప్రారంభమైంది. సర్ కారణంగా ఓటర్ల జాబితాలో తలెత్తిన లోపాలను సవరించడంతో పాటు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణం రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లికార్జున్ ఖర్గే, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ తదితర ముఖ్యనేతలు పాల్గొన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు తాము ఉద్యమాన్ని చేపట్టినట్టు కాంగ్రెస్ ప్రకటించింది. ఎన్నికల సంఘం పనితీరుపై కూడా పలు ప్రశ్నలు సంధించింది. ఎన్నికల ప్రక్రియ సమగ్రతపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని పేర్కొంది.

సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితులకు సంఘీభావంగా..

1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితులకు సంఘీభావంగా పశ్చిమ ఢిల్లీలోని హరినగర్ బస్‌స్టాప్ నుంచి తిలక్‌నగర్ మెట్రోస్టేషన్ వరకూ బీజేపీ ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, పార్టీలోని ఇతర పెద్దలూ పాల్గొన్నారు. సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితులకు సంఘీభావంగా కార్యక్రమాలు జరుగుతున్న రోజే కాంగ్రెస్ మరో నిరసన కార్యక్రమానికి తెరతీయడంపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

పోటాపోటీ నిరసన కార్యక్రమాల నేపథ్యంలో ఢిల్లీలో పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. రామ్‌లీలా మైదానంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేయడంతో పాటు డ్రోన్లు, సీసీటీవీ కెమెరాలతో నిఘా పెంచారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో పారామిలిటరీ సిబ్బంది కూడా పాలుపంచుకున్నారు.

వైఎస్ జగన్ సంచలన నిర్ణయం..

ఓటు వేయకుండానే వెనుతిరిగిన మాజీ సీఎం



అమరావతి : వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. పట్టణ పురపాలక ఎన్నికల్లో ఓఓటేయకుండానే తిరిగి వెళ్లిపోయారు.ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు తాడేపల్లి నుంచి శనివారం సాయంత్రం పులివెందుల కు చేరుకున్న జగన్‌కు ప్రభుత్వం అడుగడుగునా ఆటంకాలు కల్పించింది. ఆదివారం పోలింగ్ సందర్భంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు రాగా పులివెందులలో ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో కూర్చొనివ్వకుండా అడ్డుకున్నారని వైసీపీ ఏజెంట్లు జగన్ దృష్టికి తీసుకెళ్లారు.పులివెందుల పరిధిలోని 80 పోలింగ్ కేంద్రాల్లో 70 చోట్ల వైసీపీ ఏజెంట్లు లేరని ఆరోపించారు. దీంతో వైఎస్ జగన్ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లగా అతడిని కార్యాలయంలోకి రాకుండా బయటే అడ్డుకున్నారు. అనంతరం అధికారులే బయటకు రావడంతో వారితో జగన్ మాట్లాడారు. ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని, తమ ఏజెంట్లను అడ్డుకున్న వారిపై చట్టరిత్యా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేస్తూ తన అనుచరులతో కలసి దాదాపు గంటకుపైగా ఆర్వో కార్యాలయం బయట బైటాయించి నిరసన తెలిపారు.అనంతరం తన నివాసానికి వెళ్లిపోయారు. మధ్యాహ్నం 2 గంటలకు ఓటు హక్కు వినియో గించుకుంటారని అందరూ భావించారు. పులివెందులలో ఎన్నికల తీరును నిరసిస్తూ ఓటు హక్కు వినియోగాన్ని రద్దు చేసుకున్నారు. పులివెందులలో రీపోలింగ్ నిర్వహించినప్పుడే తాను వచ్చి ఓటు హక్కును వినియోగించుకుంటానని మీడియాకు వివరించారు.

SK1 NEWS HD
సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. సకీర్ అహ్మద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక
RNI APTEL / 2018/76380

అవినీతి రహిత పాలనే మా లక్ష్యం.. వెల్దుర్తి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం!

వైఎస్సార్‌సీపీ సర్పంచ్ అభ్యర్థిగా బొమ్మన రవిరెడ్డి ప్రకటన

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రాధాన్యం.. యువత, ప్రజల మద్దతు ఉందని వెల్లడి



వెల్దుర్తి, నజీర్ నవంబర్ 01 (సీమకిరణం న్యూస్):
కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోని వెల్దుర్తి గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) తరఫున పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ నాయకుడు బొమ్మన రవిరెడ్డి ప్రకటించారు. గ్రామ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ప్రజల ఆశీస్సులతో ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు తెలిపారు. వెల్దుర్తిలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన తన అభ్యర్థిత్వాన్ని వెల్లడించారు.
ఈ సందర్భంగా రవిరెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి రహిత పాలనకు ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశామని తెలిపారు. గత పదేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తించాలని కోరారు. తాగునీటి పైప్‌లైన్లు, కళాశాలలు, ఆసుపత్రుల ఏర్పాటు వంటి కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. వెల్దుర్తి మండలంలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చొరవ చూపానని, ముఖ్యంగా తాగునీటి సమస్యలు తలెత్తినప్పుడు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టినట్లు వివరించారు.
ప్రస్తుత ప్రభుత్వ విధానాల కారణంగా పంచాయతీలకు నిధుల విడుదలలో జాప్యం జరుగుతోందని, దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని విమర్శించారు. భవిష్యత్తులో వెల్దుర్తి గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రధాన రహదారుల విస్తరణ వంటి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
ప్రస్తుతం గ్రామంలో తనకు ప్రజల మద్దతుతో పాటు యువత నుంచి కూడా మంచి ఆదరణ ఉందని ఆయన తెలిపారు. గతంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి, గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశం కల్పించాలని ప్రజలు, నాయకులను కోరారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.
బొమ్మన రవిరెడ్డి అభ్యర్థిత్వానికి మద్దతు తెలుపుతూ, ఆయన నామినేషన్, ఎన్నికల కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

వెల్దుర్తి అభివృద్ధే నా అజెండా.. అవినీతి రహిత పాలనే నా లక్ష్యం!

వెల్దుర్తి రూపురేఖలు మారుస్తా.. ఒక్క అవకాశం ఇవ్వండి!
మాటలు కాదు.. చేతల్లో అభివృద్ధి చూపిస్తా!
ప్రముఖ వ్యాపారవేత్త తిరువీధి రమేష్ శెట్టి
వెల్దుర్తి ప్రజల ఆశీర్వాదంతో సర్పంచ్ బరిలోకి ప్రముఖ వ్యాపారవేత్త తిరువీధి రమేష్ శెట్టి







వెల్దుర్తి నజీర్, నవంబర్ 01, (సీమకిరణం న్యూస్):
వెల్దుర్తి గ్రామ అభివృద్ధికి కొత్త దిశ చూపించడమే తన లక్ష్యమని, ప్రజలకు అందుబాటులో ఉంటూ అవినీతి రహిత పాలన అందిస్తానని ప్రముఖ వ్యాపారవేత్త తిరువీధి రమేష్ శెట్టి ప్రకటించారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వెల్దుర్తి సర్పంచ్ అభ్యర్థిగా స్వతంత్రంగా పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. వెల్దుర్తిలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా గ్రామ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేయాలనే ఉద్దేశంతో ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు తెలిపారు.సుమారు 40 ఏళ్ల తర్వాత సర్పంచ్ స్థానం ఓసీకి కేటాయించడంతో గ్రామ ప్రజలు, శ్రేయోభిలాషుల ప్రోత్సాహం, కోరిక మేరకు పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు రమేష్ శెట్టి వివరించారు. గతంలో తన తండ్రి సర్పంచ్‌గా పనిచేసి ప్రజలకు సేవ చేశారని గుర్తుచేస్తూ, అదే సేవా స్ఫూర్తితో తాను కూడా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. తమకు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదని, స్వతంత్ర అభ్యర్థిగా ప్రజల ముందుకు వస్తున్నానని స్పష్టం చేశారు.
వెల్దుర్తిలో తాగునీరు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, రవాణా వంటి అనేక సమస్యలు ఉన్నాయని రమేష్ శెట్టి పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు వెల్దుర్తి గ్రామంలోకి రాకుండా హైవే మీదుగా వెళ్లిపోతుండటంతో ప్రయాణికులు, గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బస్సులు గ్రామంలోకి వచ్చేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే పాత బస్టాండ్ ప్రాంతాల్లో నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉందన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించడం, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం తన ప్రాధాన్యతలని వెల్లడించారు. గ్రామంలోని ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి టీజీ వెంకటేశ్, మంత్రి టీజీ భరత్‌ల సహకారం, ఆశీస్సులు తనకు ఉన్నాయని రమేష్ శెట్టి తెలిపారు. తాను సర్పంచ్‌గా పోటీ చేస్తున్న విషయాన్ని వారికి తెలియజేసినట్లు పేర్కొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అందరితో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామానికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. సర్పంచ్‌గా తనకు ఒక్కసారి అవకాశం కల్పిస్తే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని రమేష్ శెట్టి ధీమా వ్యక్తం చేశారు. పదవిని అధికారంగా కాకుండా బాధ్యతగా భావించి గ్రామ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. వెల్దుర్తిని అభివృద్ధి చెందిన ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన సంకల్పమని పేర్కొంటూ, గ్రామ ప్రజలందరూ తనకు మద్దతుగా నిలిచి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

వెల్దుర్తి సర్పంచ్ బరిలో బొమ్మన రవిరెడ్డి!

వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్‌కు సిద్ధం



వెల్దుర్తి, నజీర్ నవంబర్ 01 (సీమకిరణం న్యూస్):
కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలోని వెల్దుర్తి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొమ్మన రవి రెడ్డి ప్రకటిం చారు. వెల్దుర్తిలోని తన నివాసంలో నిర్వహించిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తించి తనకు మద్దతు ఇవ్వాలని నాయకులు, ప్రజలను కోరారు. బొమ్మన రవి రెడ్డి గతంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. 2021లో జరిగిన పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో వెల్దుర్తి మండల పరిషత్ పరిధిలోని వెల్దుర్తి-2 ఎంపీటీసీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నట్లు ప్రకటించారు.

కాంగ్రెస్‌తోనే కరవు కాటకాలు:

రేవంత్ సర్కారుపై భగ్గుమన్న గులాబీ దళం

హైదరాబాద్ : రాష్ట్రంలో నెలకొన్న వర్తమాన పరిస్థితులపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అధికార కాంగ్రెస్ పార్టీపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఇది కాలం తెచ్చిన 'ఎల్-నినో' కాదని, పాలకుల పట్టింపులేని తనంతో దాపురించిన 'కాంగ్రెస్-నినో' అని నిప్పులు చెరిగారు. సాగునీరు అందక బీటలు వారుతున్న పంట పొలాలు, చుక్క నీటికి నగరంలో సైతం ట్యాంకర్ల కోసం ఎదురుచూసే దుస్థితి... వెరసి అన్నదాతలను, సామాన్యులను పట్టిపీడిస్తున్న ఈ గండం వెనుక అసలు లోపమెవరిది? పాలనా వైఫల్యమా లేక పథక రచన లోపమా?
గోదావరి పాలు... కన్నీటి పాలు: తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, మేడిగడ్డ వద్ద 25 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వృథాగా పోతున్నా ఎత్తిపోసే ఆలోచన చేయట్లేదని ఆరోపించారు. "నిజం గడప దాటేలోపే అబద్ధం ఊరంతా చుట్టివచ్చింది" అన్న రీతిలో ప్రాజెక్టులపై తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా నిద్ర మేల్కొని పంటలను కాపాడాలని, ఎండిపోయిన ప్రతి ఎకరాకు రూ.50,000 నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.
రైతుబంధును నిర్లక్ష్యం చేస్తూ సాగును సంక్షోభంలోకి నెట్టారని ధ్వజమెత్తారు.సదస్సులు కాదు.. సమస్యల పరిష్కారం ముఖ్యం: ఎమ్మెల్యే డాక్టర్ కె. సంజయ్ మాట్లాడుతూ, కేసీఆర్ పాలనలో మిగులు విద్యుత్ సాధించిన తెలంగాణలో నేడు కరెంట్ కోతలు మొదలయ్యాయని పేర్కొన్నారు. పరిశ్రమలకు విద్యుత్, ప్రజలకు తాగునీరు అందించలేని స్థితిలో 'గ్లోబల్ సమ్మిట్' నిర్వహించడం కంటితుడుపు చర్యేనని విమర్శించారు.
చేతగానితనం కప్పిపుచ్చుకునేందుకు హౌస్ అరెస్టులతో ప్రతిపక్షాల గొంతు నొక్కడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ చిరుమళ్ల రాకేష్ కుమార్ పాల్గొన్నారు.

మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఎమ్మెల్సీ వర్ల రామయ్య తీవ్ర వ్యాఖ్యల



అమరావతి, అక్టోబర్ 30: వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఎమ్మెల్సీ వర్ల రామయ్య తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇటీవల జగన్, ఆ పార్టీ నేతలు చేసిన వ్యాఖ్యలపై ప్రశ్నల వర్షం కురిపించారు. నైతిక విలువలు లేని రాజకీయ పార్టీకి అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి అంటూ వ్యాఖ్యానించారు. వైసీపీ ఒక రాజకీయ పార్టీ కాదని.. అసాంఘిక శక్తులకు అడ్డా అని అన్నారు. దీనికి ముఠా నాయకుడు జగన్ అంటూ విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్యహితంగా ప్రజలకు సమన్యాయం అందించేందుకు రాజకీయ పార్టీ పెడతారు తప్ప.. జగన్ లాగా స్వార్థ రాజకీయల కోసం కాదని అన్నారు.
'రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా, నేను పులివెందుల వస్తా ఎన్నికలప్పుడు చేతులు మడుస్తా అంటే.. అరాచకం చేస్తాననేనా జగన్? ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికల సమయంలో చేతులు మడుస్తానని అటు ప్రజలను ఇటు పోలీసులను భయభ్రాంతులను చేయడం తగునా జగన్. మీ నాయకుడు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఎందుకు రాష్ట్రం వదిలి ఇతర రాష్ట్రాలకు పరారయ్యాడో సమాధానం చెప్పగలరా జగన్? మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మద్యం కుంభకోణం, కల్తీ మద్యం సరఫరా, స్వామి వారి లడ్డూ కల్తీ వీటన్నింటిలో అరెస్ట్ అయినా మీ దగ్గర పనిచేసిన నాయకులను చూసి కూడా మీది రాజకీయ పార్టీ అని ధైర్యంగా చెప్తారా జగన్' అంటూ ప్రశ్నలు సంధించారు. అంతేకాకుండా వైసీపీ నేత రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, మాజీ మంత్రి రోజా, ఎంపీ అవినాశ్ రెడ్డి కూడా పోలీసులను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యాఖ్యలు చేశారని.. వాటికి ఏం సమాధానం చెబుతారంటూ జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.తల్లి, చెల్లిని నిర్లక్ష్యం చేసి రోడ్డునపడేసిన జగన్‌కు నైతిక విలువల గురించి మాట్లాడే హక్కు ఉందా అని ఎమ్మెల్సీ నిలదీశారు. జగన్, అతని పార్టీ నాయకులు వ్యవహరిస్తున్న తీరును, వారి వ్యాఖ్యల వీడియోలు తెప్పించుకుని ప్రెస్ క్లిప్పింగ్స్ చూసి.. ఆ పార్టీ గుర్తింపును రద్దు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఎమ్మెల్సీ వర్ల రామయ్య కోరారు.

ఆదిలాబాద్‌కు ఏముఖం పెట్టుకుని వస్తారు..

కేటీఆర్‌పై కవిత ధ్వజం



ఆదిలాబాద్, అక్టోబరు 30 : బీఆర్ఎస్, మాజీ మంత్రి కేటీఆర్‌పై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత (ఖుజెఖ్ఖ్ము) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు (శుక్రవారం) ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లిలో జరిగిన పాంచజన్య సంకల్ప సభలో కవిత పాల్గొని ప్రసంగించారు. ఎల్లుండి ఆదిలాబాద్‌లో జరిగే బీఆర్ఎస్ గర్జనపై ఆమె హాట్ కామెంట్స్ చేశారు. అది గర్జన కాదని... తర్జన భర్జన అని ఎద్దేవా చేశారు. అది సిద్దిపేట బాబు- సిరిసిల్ల బాబు మధ్య జరుగుతున్న తర్జన భర్జన అని సెటైర్లు గుప్పించారు. అధికారంలో ఉన్నప్పుడు ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమను ఎందుకు తెరిపించలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఆ పరిశ్రమను ఎందుకు కాపాడలేక పోయారని నిలదీశారు. కాగజ్ నగర్ ప్రైవేట్ కాగితపు పరిశ్రమను తెరిపించిన కేటీఆర్.. ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ రంగ పరిశ్రమను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నల వర్షం కురిపించారు.
రుగుతా.. ఈటల సంచలన వ్యాఖ్

ఏ ముఖం పెట్టుకుని ఆదిలాబాద్‌లో రైతు గర్జన పెడుతున్నారో కేటీఆర్ చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. చనాఖా- కొరాటా బ్యారేజీకి అదనంగా పెట్టిన రూ. 1700ల కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో చెప్పాలని పట్టుబట్టారు. నాటి జిల్లా మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, జోగు రామన్న తిన్నారా..? లేకపోతే నాటి ఇరిగేషన్ మంత్రిగా ఉన్న వ్యక్తి జేబుల్లోకి వెళ్లాయో..? చెప్పాలని ప్రశ్నించారు. పరిశ్రమ మంత్రిగా దేశ విదేశాలు తిరిగిన కేటీఆర్... వెనుకబడ్డ ఆదిలాబాద్ జిల్లాలో టెక్స్‌టైల్స్ పార్క్‌ను ఎందుకు పెట్టలేదో చెప్పాలని సవాల్ చేశారు. తన ప్రశ్నలకు జవాబు చెప్పిన తర్వాతనే.. కేటీఆర్ ఆదిలాబాద్ రైతు గర్జనకు రావాలని కవిత ఛాలెంజ్ చేశారు.

SK1 NEWS HD
సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
జాతీయ తెలుగు దినపత్రిక
RNI APTEL / 2018/76380

పవన్ కల్యాణ్ 33వ సినిమాకు రంగం సిద్ధం..

దర్శకుల రేసులో అనిల్ రావిపూడి, వంశీ పైడిపల్లి..!



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రజాసేవ, పాలనా వ్యవహారాల్లో బిజీగా ఉన్న పవర్ స్టార్ పవన్ కల్యాణ్ మళ్లీ వెండితెరపై సందడి చేయనున్నారనే దాని గురించి టాలీవుడ్‌లో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. రాజకీయాల్లో కీలక బాధ్యతలు చేపట్టిన తర్వాత పవన్ సినిమాలకు దూరమవుతారని చాలామంది భావించారు. అయితే తన అభిమానుల కోసం మరో చిత్రాన్ని పట్టాలెక్కించేందుకు ఆయన సిద్ధమవుతున్నారనే ప్రచారం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. పవన్ కెరీర్‌లో 33వ సినిమాగా ఈ ప్రాజెక్ట్ తెరకెక్కనుందని వార్తలు వినిపిస్తున్నాయి.

ఈ సినిమాను ప్రముఖ నిర్మాత దిల్ రాజు తన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థపై నిర్మించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో పవన్ కల్యాణ్, దిల్ రాజు కలయికలో వచ్చిన 'వకీల్ సాబ్' మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో పవన్ నటనకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు మరోసారి ఈ ఇద్దరూ కలిసి పనిచేయబోతున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.

తన రాజకీయ, పాలనా బాధ్యతలకు ఇబ్బంది కలగకుండా పవన్ ఈ సినిమా కోసం ప్రత్యేకంగా కాల్షీట్లు కేటాయించనున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. పవన్ 33వ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం ఎవరికి దక్కుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ ప్రాజెక్ట్ కోసం ఇద్దరు ప్రముఖ దర్శకుల పేర్లు వినిపిస్తున్నాయి. వారిలో ఒకరు అనిల్ రావిపూడి కాగా, మరొకరు వంశీ పైడిపల్లి. కమర్షియల్ ఎంటర్‌టైనర్లతో వరుస విజయాలు అందుకుంటున్న అనిల్ రావిపూడి ప్రస్తుతం వెంకటేశ్, కల్యాణ్ రామ్ కలయికలో తెరకెక్కనున్న మల్టీస్టారర్ పనుల్లో బిజీగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు వంశీ పైడిపల్లి బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్‌తో సినిమా చేస్తున్నారు. ఈ ఇద్దరిలో పవన్ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం ఎవరికి దక్కుతుందనే దానిపై ఇంకా స్పష్టత లేదు.

సినిమా న్యూస్

కట్టిపడేసే చూపులు.. కిర్రెక్కించే పోజులు..



నాతో క్షమాపణలు చెప్పించారు.. ఇప్పుడు అవే పనులు బహిరంగంగా చేస్తున్నారు:



యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ సోషల్ మీడియా వేదికగా పెట్టిన ఒక ఆవేదనభరితమైన పోస్ట్ ప్రస్తుతం సినీ వర్గాల్లోనూ, నెట్టింటనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సమాజంలో మరియు ఆన్‌లైన్ వేదికలపై మనుషుల ప్రవర్తనలో కనిపిస్తున్న డబుల్ స్టాండర్డ్స్ తనను ఎంతగానో బాధిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. తనను నిందితులుగా భావించేలా చేసిన కొందరు వ్యక్తులే.. ఇప్పుడు అదే పరిస్థితుల్లో పాత్రలు తారుమారైనప్పుడు అవే పనులను బహిరంగంగా చేస్తుండటం విచిత్రంగా ఉందని ఆమె ఎత్తిచూపారు.ఇచ్చుకునేలా చేసి తనను క్షమాపణలు చెప్పే దయనీయ స్థితికి నెట్టారని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

కంగనా రనౌత్‌తో రవిబాబు హారర్ సినిమా..

టాలీవుడ్ నటుడు, నిర్మాత రానా దగ్గుబాటి మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈసారి బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కంగనా రనౌత్‌తో ఓ భారీ హారర్ థ్రిల్లర్‌ను నిర్మించేందుకు సిద్ధమయ్యారు. తెలుగు దర్శకుడు రవిబాబు ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. న్యూఢిల్లీలో హాలోవీన్ సందర్భంగా నిర్వహించిన 'హారర్‌కాన్ ఇండియా 2026' కార్యక్రమంలో రానా ఈ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. 'స్కేరీ పిక్చర్' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ హారర్ థ్రిల్లర్‌లో కంగనా రనౌత్ ప్రధాన పాత్ర పోషించనున్నారు. విభిన్నమైన కథలు, ప్రయోగాత్మక చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న రవిబాబు ఈ సినిమాకు దర్శకత్వం వహించనుండటం విశేషం.



తెలుగులో ఎన్నో వైవిధ్యమైన పాత్రలు, సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న రవిబాబు.. ఇప్పుడు తొలిసారిగా హిందీ చిత్రానికి దర్శకత్వం వహించబోతున్నారు. ఈ ప్రాజెక్టును రానా దగ్గుబాటి నిర్మిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, స్పిరిట్ మీడియా సంస్థలపై సినిమా రూపొందనుంది. కంగనా తన సామాజిక మాధ్యమ ఖాతాలో రానా ప్రకటించిన వీడియోను పంచుకోవడంతో ఈ ప్రాజెక్టుకు మరింత ప్రచారం లభించింది. తెలుగు సినీ పరిశ్రమలో రవిబాబుకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. 'అనసూయ', 'అవును' వంటి సినిమాలతో హారర్, సస్పెన్స్ థ్రిల్లర్ కథలను విభిన్నంగా తెరకెక్కించగల దర్శకుడిగా పేరు సంపాదించారు. సాధారణ కథనాలకు భిన్నంగా కొత్త ప్రయోగాలు చేయడం ఆయన ప్రత్యేకత. 'అదుగో' వంటి ప్రయోగాత్మక చిత్రంతోనూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు.ఇప్పుడు కంగనా రనౌత్ లాంటి ప్రతిభావంతమైన నటితో హిందీలో హారర్ సినిమా రూపొందిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై ఆసక్తి పెరిగింది. రవిబాబు తనదైన శైలిలో భయానక వాతావరణాన్ని ఎలా సృష్టిస్తారోనని సినీ అభిమానులు ఎదురుచూస్తున్నారు. కంగనా రనౌత్ గతంలో 'రాజ్: ది మిస్టరీ కంటిన్యూస్' సినిమాలో హారర్ నేపథ్యంలో నటించారు. ఆ తర్వాత 'చంద్రముఖి 2' వంటి చిత్రాల్లోనూ కనిపించారు. ఇప్పుడు 'స్కేరీ పిక్చర్'తో మరోసారి హారర్ కథలో ప్రధాన పాత్ర పోషించనున్నారు. దాదాపు 17 ఏళ్ల తర్వాత హిందీలో పూర్తిస్థాయి హారర్ చిత్రంతో ఆమె ప్రేక్షకులను పలకరించబోతున్నారనే చర్చ జరుగుతోంది. మొత్తానికి కంగనా నటన, రవిబాబు దర్శకత్వం, రానా నిర్మాణం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి.

ప్రభాస్ 'ఫౌజీ' షూటింగ్‌పై కీలక అప్‌డేట్..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుస భారీ చిత్రాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ఉండగా, వాటిలో దర్శకుడు హను రాఘవపూడితో చేస్తున్న 'ఫౌజీ' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాకు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. కొంతకాలం విరామం తర్వాత ఈ సినిమా చిత్రీకరణను తిరిగి ప్రారంభించేందుకు ప్రభాస్ సిద్ధమయ్యారు. ప్రస్తుతం 'కల్కి 2' చిత్రీకరణలో పాల్గొంటున్న ప్రభాస్.. త్వరలోనే 'ఫౌజీ' సెట్స్‌లోనూ అడుగుపెట్టనున్నారు. నవంబర్ 3, 2026 నుంచి ఈ సినిమా షూటింగ్ తిరిగి ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఇప్పటికే చిత్రీకరణ తుది దశకు చేరుకున్న నేపథ్యంలో మిగిలిన భాగాన్ని త్వరగా పూర్తి చేయాలని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఇటీవల విడుదలైన 'ఫౌజీ' గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని పెంచింది. ప్రభాస్ లుక్, సినిమా నేపథ్యం, యాక్షన్ అంశాలు అభిమానులను ఆకట్టుకున్నాయి.

దీంతో ఈ సినిమా ఎప్పుడు థియేటర్లలోకి వస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. హను రాఘవపూడి ఈ సినిమాను పీరియాడిక్ నేపథ్యంలో భారీ చారిత్రక యాక్షన్ డ్రామాగా రూపొందిస్తున్నారు. సాధారణ కమర్షియల్ కథలకు భిన్నంగా చారిత్రక నేపథ్యం, భావోద్వేగాలు, యాక్షన్ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com